

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై 1794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాధలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపధ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

*(గతసంచికతరువాయి)*

**పక్షీరాజు** అనే చిన్న సామంతరాజు లేచి "విజయనగరం సంస్థానాన్ని రక్షించడానికి ప్రస్తుతం ఉన్న సైనికులతోపాటు యుద్ధ విద్యలు నేర్చిన కనీసం రెండు వందలమంది వీరుల అవసరం ఉంది. ఇటువంటి వారిని తక్షణం తయారు చేయాలి విజయనగరం కోట చుట్టూ ఉన్న కందకం మరింత పటిష్టం చేయాలి. శత్రు మూకలు ముందుకు రాకుండా ఆ కందకంలో మొసళ్ళను పెంచాలి. అందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలి చినరాజావారితోపాటు ఇతర రాజులంతా ఆలోచనలు చేయాలి" సూచించాడు.

అతని సూచనను అందరూ అంగీకరించారు.

సంస్థానం పరిధిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సామంతరాజులు, బంధువర్గానికి చెందిన వారు ఇచ్చిన రకరకాల సూచనలు సలహాలను విజయనగరం దివాణం పెద్దలు స్వీకరించారు. వాటిని ఆచరణలో పెట్టడానికి వీలుగా నమోదు చేసుకున్నారు.

విజయరామరాజు వయస్సులో చిన్నవాడు అయినప్పటికీ అవగాహన కలిగిన వ్యక్తి. చెప్పిన విషయాలను అర్థం చేసుకున్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో తనపై ఎంతటి గురుతరమైన బాధ్యత ఉందో తెలుసుకున్నాడు. తాను విజయనగరం పీఠంపై సంస్థానాధీశునిగా పాదం మోపిన తర్వాత మొదట తన కర్తవ్యం తెలియలేదు కానీ ఇప్పుడు అందరూ చెబుతున్నమాటలను విన్న తర్వాత తనపై చాలామంది ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్నారని తెలుసుకున్నాడు. తనని తన దివాణాన్ని నమ్ముకుని ఎంతోమంది తన వెనుక ఉన్నారని అర్థం చేసుకున్నాడు. ఈ పరిస్థితిలో తన కర్తవ్యం ఎంతో కీలకమైనదని భావించాడు.

ఆ తర్వాత విజయనగరం సంస్థానానికి అనుబంధంగా ఉన్న వివిధ చిన్న దివాణాలకు చెందిన రాజులు సంస్థానాధీశులు చెప్పిన విషయాలు ఆధారంగా ఆ సమావేశంలో కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని ఖచ్చితంగా అమలు జరపాలని అందుకు అవసరమైన వ్యయాన్ని భరించాలని తీర్మానించారు.

ముఖ్యంగా రెండు వందలమంది యుద్ధవీరుల్ని తయారు చేయడంతోపాటు వందమంది మల్లయోధుల్ని కూడా సిద్ధం చేయాలని వారికి నిరంతరం యుద్ధశిక్షణ అందించాలని అనుకున్నారు. కత్తియుద్ధం, కర్రసాము, తుపాకీ పేల్చడం వంటివి నేర్పించాలని గ్రామీణ ప్రాంతాల నుంచి సైన్యంలో పనిచేయడానికి ఉత్సాహం చూపించే ఉడుకురక్తం కలిగిన యువకుల్ని ఎంపిక చేసి వారిని యోధులుగా తయారుచేయాలని నిర్ణయించారు. అందుకోసం సైనికుల్ని ఊరూరా పంపించి ఉత్సాహం కలిగిన యువకుల్ని గుర్తించాలని నిర్ణయించారు.

సమావేశం అనంతరం వివిధ విషయాలపై తీసుకున్న నిర్ణయాలను అక్కడికి వచ్చిన వారికి వెల్లడించారు.

"ఈ పనులు సక్రమంగా నిర్వర్తించడానికి నగదు కావాలి. వారి జీతభత్యాలు నిర్వహణ వ్యయం కోసం ఆదాయాన్ని పెంచుకోవాలి. ఈ విషయాలను కూడా వచ్చినవారంతా ఆలోచించాలి" వృద్ధుడైన సీతరాజు సూచించారు.

"ఆదాయాన్ని పెంచుకోవడానికి పన్నులు వసూలు సక్రమంగా జరిగేలా చూడాలి ప్రస్తుతం చాలామంది రైతులనుంచి ఇనాం శిస్తులు కూడా వసూలు కావడంలేదు. దానిపై దృష్టిసారించాలి. ఆదాయాన్ని సమకూర్చుకోవాలి"

గోపాలరాజు లేచి నిల్చుని "దివాణం ఆర్థిక పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. సీతబాబు చెప్పిన విధంగా ఆదాయాన్ని పెంపొందించుకునే దిశగా ఆలోచన చేయాలి. ఇటువంటి వ్యవహారాలు చూడటానికి దివాణంలో సలహాదారులు అవసరం ఉంది చినరాజా వారు ఇంకా చిన్నవారైనందున అతనికి సహాయకంగా ఎవర్నయినా నియమిస్తే మంచిది."

"అన్ని సంస్థానాల్లో ఆదాయాన్ని పెంచడానికి పన్నులు వసూలు చేయడానికి దివాన్ అనే పదవి ఉంటుంది. కానీ విజయనగరం సంస్థానంలో గతంలో పెదవిజయరామరాజుగారే అన్నీ చూసేవారు. ఆయన తర్వాత ఆ బాధ్యతలు చూడటానికి ప్రస్తుతం దివాన్‌ని నియమించాలి" నీలాద్రిరాజు సూచించారు.

అందరి దృష్టి దివాన్ నియామకంపై పడింది.

అంతవరకు ప్రధాన దివాన్‌గా ఉన్న బుర్రా బుచ్చెన్న వృద్ధుడు అయిపోయాడు. అన్ని విషయాలలో నిర్ణయాలను తీసుకోలేకపోతున్నాడు. అందువల్ల ఎవర్నయినా సమర్థులైన వ్యక్తిత్ని దివాన్‌గా నియమిస్తే మంచిదని అక్కడివారు అభిప్రాయపడ్డారు.

విజయనగరం సంస్థానానికి దివాన్‌గా ఎవర్ని నియమించాలి? ఎప్పుడు నియమించాలన్న విషయంలో సూచనలు సలహాలు ఇవ్వండి. ఈ దివాణంలో చినరాజావారికి సలహాల కోసమే కాకుండా ఆదాయాన్ని పెంచేందుకు శిస్తులు వసూలు చేసేందుకు దివాన్ పదవి అవసరం ఉంది. అయితే వయసులో చిన్నవారైన విజయరామరాజుకు కుడి భుజంగా అతనికి అనుకూలంగా సహాయకునిగా దివాన్ ఉండాలి. అటువంటి వ్యక్తినే దివాన్‌గా నియమించాలి. ఎవర్ని నియమించాలన్న విషయాన్ని ఆలోచన చేయాలి"

"అవును.. అవును" రాజులంతా ముక్తకంఠంతో నినదించారు.

***విజయనగరంలో దివాన్ నియామకం***

విజయనగరం సంస్థానంలో పనిచేయడానికి దివాన్ పదవి కోసం రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ఈ పదవీ బాధ్యతల నిర్వహణ విషయంలో అనుభవం ఉన్నవారిని నియమించినట్లయితే పరిపాలన సజావుగా ఉంటుందని భావించారు. తుని సంస్థానం నుంచి చిన విజయరామరాజును దత్తత తీసుకున్న చంద్రయ్యమ్మ కుటుంబ సభ్యులు అక్కడినుంచి రాజా రాంభద్ర రాజుని దివాన్‌గా పంపించడానికి ప్రయత్నాలు చేశారు. అతనికి ఎంతో అనుభవం ఉన్నప్పటికీ డెబ్బయి సంవత్సరాల వృద్దుడు అయినందున అతను రావడానికి ఇష్టపడలేదు. అతని కుటుంబ సభ్యులను ఒప్పించి అక్కడినుంచి విజయనగరానికి మకాం మార్చడానికి ప్రయత్నాలు చేశారు. చివరి నిమిషంలో అతను దివాన్‌గా రాలేకపోయాడు. ఆ ప్రతిపాదన బెడిసికొట్టింది.

ఆ తర్వాత చాలా ప్రాంతాలలో అనుభవం కలిగిన వ్యక్తుల కోసం అన్వేషణ కొనసాగింది. ఎవరిని చూసిన వారిలో ఏదో లోపం కనిపించేది. విజయరామరాజుకు సహాయకారిగా ఉండటంతో పాటు రాజ్య వ్యవహారాలను చూసుకోవడానికి తగిన వ్యక్తి లభించడానికి చాలాకాలం పట్టింది. ముఖ్యంగా సంస్థానానికి చెందిన వారు ఈ దివాన్ పదవిలో క్షత్రియ కుంటుంబానికి చెందిన వారై ఉండాలన్న నిబంధన విధించారు. ఇందువల్ల తెలివైన వారు విద్యావంతులు లభించినా వారు రాజులు కానందువల్ల అనర్హత ఏర్పడేది. సామంతరాజులు తమ వంతు ప్రయత్నాలు చేసి ఒకరిద్దరి పేర్లు చెప్పి వారిని విజయనగరం తీసుకుని వచ్చి దివాణం నిర్వాహకుల్ని ఒప్పించడానికి కృషిచేశారు. అయితే వారికి సంబంధించిన వ్యక్తులు దివాన్‌గా విజయనగరం సంస్థానంలో బాధ్యతల్లో ఉంటే తమ ప్రాంతీయుల పట్ల పక్షపాతం ఉంటుందని ఆ ప్రతిపాదనల్ని కూడా తిరస్కరించారు.

"మన ముందు చాలా సవాళ్ళు ఉన్నాయి. దివాన్ ఉంటే చాలా సమస్యలు పరిష్కరించవచ్చునన్న విషయం ఇప్పుడు స్పష్టం అయింది. ప్రయత్నాలు ఎంతవరకూ వచ్చాయి" విజయరామరాజు గోపాలరాజుని కలిసినప్పుడల్లా అడిగేవాడు.

"ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని సమాధానం చెప్పేవాడు.

అయితే విజయరామరాజు ప్రశ్నలకు జవాబు చంద్రయ్యమ్మ నుంచి వచ్చింది. గోపాలరాజు చెబుతున్న విషయాలు వింటున్న ఆమెకు ఒక విషయం అర్థం అయింది. దివాన్‌గా ఎవర్ని నియమించినా అతను చినరాజావారికి తెలిసివాడు అనుకూలమైన వ్యక్తి అయి ఉండాలని ఆ విషయమే గోపాలరాజుతో చెబుతూ "దత్తత కోసం మనం మన వంశానికి చెందిన చినరాజావారిని ఎలా వెతుక్కున్నామో దివాన్ పదవికి కూడా అలా వెతుక్కుంటేనే మంచిదని అనిపిస్తోంది. ముఖ్యంగా చినరాజా బంధువులలో ఎవ్వరైనా ఉంటే బాగుంటుంది" అంది.

చంద్రయ్యమ్మ చెప్పిన విషయం విన్న తర్వాత గోపాలరాజుకు అది నిజమేనని అనిపించింది. గతకొంతకాలంగా చిన్న రాజావారు ఏదో కోల్పోయిన మాదిరిగా ఉంటున్నారు. పుట్టి పెరిగిన ఊరినుంచి విజయనగరం దత్తతకు వచ్చిన తర్వాత మొదట ఏదోలా ఉండేవారు.

అష్టఐశ్వర్యాలు ఉన్నప్పటికీ ఏదో కోల్పోయిన బాధ తనకు దగ్గరివారికి దూరమయ్యానన్న వేదన ఉండేదని అనిపించేది. అది నివారించాలంటే అతని బంధువర్గంలో చినరాజాకు సన్నిహితంగా ఉండే తెలివైన వ్యక్తి ఎవరన్నది గుర్తించాలని అనుకున్నాడు.

గోపాలరాజు అన్వేషణ కొద్దిరోజుల్లోనే ఫలించింది.

విజయరామరాజుగా పేరు మార్చుకుని దత్తత వచ్చిన వెంకటపతిరాజు కుటుంబం చాలా పెద్దది. అతని తండ్రికి ముగ్గురు సోదరులు ఉన్నారు. వారిలో పెద్ద సోదరునికి పూసపాటి సీతారామరాజు ప్రథమ సంతానం. అతను గణితం, వేదాలు ఉపనిషత్తులు చదువుకున్న అనుభవం ఉన్నవాడు. ఆ గ్రామంలో కరణీకం చేసిన చిట్టిపంతులు వద్ద కొద్ది కాలం పనిచేసి కొంతజ్ఞానాన్ని సంపాదించాడు. ప్రస్తుతం చిన్న కొలువులో ఉన్నాడు. తెలివితేటలతోపాటు చినరాజాకు వరసకు పెద్దఅన్నయ్య అవుతాడు. అందువల్ల అతడిని దివాన్‌గా తీసుకుని వస్తే పరిపాలన గాడిలో పడటంతోపాటు చినరాజాకు తనసోదరుడు సన్నిహితుడు తోడు ఉన్నట్లుగా ఉంటుందని భావించారు.

వెంటనే తాళ్ళపాలెం ప్రాంతానికి వెళ్ళి సీతారామరాజు గురించి ఆరా తీసాడు.

చాలామంది అతని సన్నిహితులు స్నేహితులు అతని తెలివితేటలు గురించి గొప్పగా చెప్పారు. చాలారకాల ఉద్యోగాలు వెలగబట్టిన అనుభవం ఉన్నందున అతను ఏ పని అప్పగించినా చేయగలడని భరోసా ఇచ్చారు. వారికి సీతారామరాజు దివాన్ కాబోతున్నాడన్న విషయం తెలియకపోయినా అతని చురుకుతనాన్ని వివరించారు.

ఈ విషయాలన్నీ గోపాలరాజు చంద్రయ్యమ్మకు వివరించాడు.

విజయనగరం సంస్థానాధీశునిగా ఉన్న చిన విజయరామరాజుకు అన్నయ్య వరస అయ్యే సీతారామరాజుకు మధ్య ఇరవై అయిదు సంవత్సరాల వయస్సు తేడా ఉంది. అయినా వీరిద్దరూ ఒకే కుటుంబ సభ్యులన్న కారణంగా ఈ ప్రతిపాదనకు దివాణంలో ముఖ్యలంతా అంగీకరించారు.

ఎక్కడో మారుమూలకు గ్రామంలో అనామకునిగా ఉన్న సీతారామరాజుకు సంస్థానంనుంచి కబురు వెళ్ళింది. దివాన్‌గా అవకాశం కల్పిస్తున్నట్లు వర్తమానం అందుకుని సీతారామరాజు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. నక్కను తొక్కిన మాదిరిగా అదృష్టం తన్నుకుని వచ్చిందని ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. విజయనగర సంస్థానంలో తన పినతండ్రి కుమారుడు వెంకటపతిరాజు దత్తుడిగా వెళ్ళి చినవిజయరామరాజుగా పరిపాలన చేస్తున్నందున అతని దగ్గరికి వెళ్ళి దివాణంలో ఏదో నౌకరీ అడగాలని అనుకునేవాడు లేదా ఏదో చిన్నపాటి ఉద్యోగం వెలగబెట్టాలని ఉందని వెళ్ళి కలుసుకుని చెపుదామనుకుంటున్న సమయంలో ఏకంగా దివాన్ పదవితో తనను అదృష్టం వెతుక్కుని వస్తుందని ఊహించలేకపోయాడు.

మంచిరోజు చూసుకుని పూసపాటి సీతారామరాజు విజయనగరం వచ్చి దివాణంలో కీలకమైన దివాన్ పదవీ బాధ్యతల్ని స్వీకరించాడు. ముందుగా వెళ్ళి పరిపాలకునిగా ఉన్న తన పినతండ్రి కుమారుడు తమ్ముడు చిన విజయరామరాజుని కలుసుకున్నాడు.

చిన విజయరామరాజు అన్నయ్య దివాన్‌గా రావడంపట్ల ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశాడు. "మీరు ఇక్కడ ఈ దివాణంలో నావద్ద ఉంటే నాకు ఎంతో ధైర్యంగా ఉంటుంది. మీ సలహాలతో ఈ విజయనగరం సంస్థానం మరింత అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోంది" అన్నాడు.

కొత్త దివాన్ సీతారామరాజు చిన్నగా నవ్వాడు.

"అంతా బాగుంటుంది. పరిస్థితులు సర్దుబాటు అవుతాయి. మీరు ఈ రాజ్యంలో చేయాలనుకున్న మార్పులన్నీ సజావుగా జరుగుతాయి. నా అండదండలు ఎప్పుడూ తమ్ముడిగారికి ఆశీర్వచనాలుగా ఉంటాయి" చెప్పాడు. అతను ఆ విషయాలు చెప్పి దివాణం వివరాలను తెలుసుకునే సమయంలోనే అంతవరకు ప్రధాన దివాన్‌గా ఉన్న బుర్రా బుచ్చెన్న దాసన్నపేటలో అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో సీతారామరాజే పూర్తిస్థాయి దివాన్‌గా బాధ్యతల్ని నిర్వహించవలసిన పరిస్థితులు తలెత్తాయి.

విజయనగరం సంస్థానంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం దివాన్‌గా సీతారామరాజు బాధ్యతల్ని స్వీకరించాడు. అతని స్వగ్రామం నుంచి సామాన్లతో బయలుదేరి విజయనగరం చేరుకుని దివాన్‌గా బాధ్యతల్ని స్వీకరించాడు. విజయనగరం సంస్థానంలో ప్రధాన దివాన్‌గా ఆయన చేరికతో మార్పుకు శ్రీకారం జరిగింది.

అయితే ఆ దివాన్ చర్యల కారణంగానే తన దివాణంపై బ్రిటిష్‌వారి వ్యతిరేక చర్యలు మొదలవుతాయనిగాని అందుకోసమే పద్మనాభ యుద్ధం జరుగుతుందని కాని ఆ యుద్ధంలో తన సామ్రాజ్యం పతనం అవుతుందని కాని యువకుడైన చిన విజయరామరాజుకి ఆ క్షణంలో తెలియలేదు.

***సంస్థానాలపై బ్రిటిష్ వారి ప్రభావం***

భారతదేశానికి వర్తక వాణిజ్యాల కోసం వచ్చిన బ్రిటిష్ వారు క్రమక్రమంగా తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకునే పనిలో పడ్డారు. ఈ పనులను ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో చేపట్టడానికి వ్యూహాలను తయారుచేసుకున్నారు. వ్యాపారాల విషయంలో లండన్ ప్రభావం భారతదేశంలో ఎక్కువగా ఉండేది. విదేశాల నుంచి ఓడలద్వారా దిగుమతి అయ్యే సిల్కు వస్త్రాలు ఇక్కడ తక్కువ ధరలకు అమ్మకం చేసేవారు. దీనివల్ల చాలామంది భారతీయులు ఆకర్షణీయంగా ఉండే ఇటువంటి విదేశీ వస్తువుల కొనుగోలు చేయడానికి ఆకర్షితులయ్యేవారు. స్వదేశంలో తయారయ్యే నూలు వస్త్రాలు చేనేతబట్టలకన్నా విదేశాల నుంచి వచ్చే సిల్కు దుస్తులు నాణ్యతతో ఉండటంతో పాటు తక్కువ ధరలు లభించడంవల్ల వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించేవారు.

ఈ ప్రభావం ఇతర విదేశీ వస్తువులపై కూడా పడింది.

క్రమక్రమంగా బ్రిటిష్ వారు భారతదేశంలో తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్న సమయంలో వివిధ ప్రాంతాలలో ఉన్న చిన్న చిన్న రాజ్యాలు దివాణాలు ఆంగ్లేయుల స్వతంత్ర పరిపాలనకు అడ్డంకిగా తయారయ్యాయి. ముఖ్యంగా రైతుల ఆధీనంలో ఉన్న పంట భూములకు కౌలుదారులు సాగు చేసుకుంటున్న భూములకు ఆయా పరిధిలో ఉన్న సంస్థానాధీసులే తమతమ దివాన్‌ల ద్వారా పన్నులను విధించడం, శిస్తులను వసూలు చేయడం వంటి పనులను చేసుకునేవారు. వాటి ఆదాయం కూడా సంస్థానాలకే లభించేది. పరిపాలన బ్రిటిష్ అధికారుల చేతిలో ఉన్నప్పటికీ భూముల హక్కులు ఇనాం భూముల శిస్తులు అన్నీ సంస్థానాలకు లభించడం బ్రిటిష్ అధికారులకు మింగుడుపడేదికాదు. ఈ విషయంలో తమ ఆధిపత్యం చూపించడం కోసం ఆదాయాన్ని తాము పొందడం కోసం వారి దృష్టి దేశంలో ఉన్న చిన్న చిన్న సంస్థానాలపై పడింది.

విశాఖ జిల్లా చాలా విస్తారంగా ఉండేది.

జిల్లా పరిధిలో ఆరు చిన్న సంస్థానాలు ఉండేవి. అందులో కోటవురట్ల, మాడుగుల, అనకాపల్లి, తుని, వంటి చిన్నా చితకా సంస్థానాలపై మొదటిసారి బ్రిటిష్ అధికారుల దృష్టిపడింది. వీటన్నింటికన్నా విజయనగరం సంస్థానం పెద్దదిగా ఉండేది. ఎక్కువ భూములు ఆస్థులను కలిగి ఉండేది. అందువల్ల ముందుగా చిన్న సంస్థానాలను తమ ఆధీనంలోకి తీసుకుని తర్వాత మిగిలిన వాటిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ విషయాలను గమనించిన కొంతమంది చిన్న సంస్థానాలకు చెందినవారు తిరుగుబాటు చేయడానికి ప్రయత్నాలు చేశారు. బ్రిటిష్ అధికారులతో రాయబారాలు కూడా జరిపారు. అయితే తెల్లదొరల బ్రిటిష్ ఆర్థిక అంగబలాల ముందు తాము నిలబడలేమని వారితో రాజీకి వచ్చే వాతావరణాన్ని కొంతమంది కల్పించుకున్నారు. అటువంటి వారి విషయంలో బ్రిటిష్ అధికారులు ఉదారత చూపించేవారు. ఆయా రాజులకు ముఖ్యమైన రాయితీలను కూడా ఇచ్చేవారు. కొన్ని సంస్థానాల విషయంలో ఒకలా మరి కొన్నింటి విషయంలో మరోలా ఉండటాన్ని కొంతమంది స్వదేశీ రాజులు తట్టుకోలేకపోయారు. తమ మధ్య విబేధాలు సృష్టించడానికి బ్రిటిష్ వారు కావాలనే ప్రయత్నాలు చేస్తున్నారని వారు భావించేవారు. విభజించి పాలించు సూత్రాన్ని అవలంబిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.



దివాన్‌జీ కాల్వ ఈ కాల్వ విశాఖ జిల్లాలో భీమిలి ఆనందపురం పద్మనాభం మండాల రైతులకు ఉపయోగపడుతోంది విజయరామరాజు వద్ద ఉండే దివాన్ సీతారామరాజు నిర్మించినందున దీనిని దివాన్‌జీ కాల్వగా పిలుస్తుంటారు ప్రస్తుతం ఈ కాల్వ శిధిలం అయిపోయింది నీటి పారుదలశాఖ దీనిని నిర్వహిస్తోంది

ఈ విషయాలను, వివక్షతను అన్ని ప్రాంతాలలో సంస్థానాధీశులు బ్రిటిష్ అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. విశాఖ జిల్లాలో కూడా కొంతమంది సంస్థానాలకు చెందిన రాజులు ఈ విషయాలను విశాఖజిల్లా కలెక్టరు దృష్టికి తీసుకుని వచ్చారు. ఆయన ఒక నివేదిక రూపంలో లండన్‌లో బ్రిటిష్ కౌన్సిల్ దృష్టికి ఈ వివాదాలను తీసుకుని వెళ్ళారు.

దేశంలో రాజులు, రాణులు పరిపాలిస్తున్న చిన్న సంస్థానాల విషయంలో సత్వరంగా ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి వీలుగా సిఫార్సులు కోసం ఒక కమిటీ వేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ ఇచ్చే సిఫార్సులను అమలు చేయడానికి అందరూ అంగీకరించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిని స్వదేశంలో ఉన్న వివిధ సంస్థానాలకు చెందిన రాజులంతా అంగీకరించారు. సిఫార్సులు ఏ విధంగా ఉన్నా తాము అమలు జరుపుతామని లిఖిత పూర్వకంగా అధికారులకు తెలియజేశారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments